ప్రజాశక్తి
ఆదివారం 4 జనవరి 2026
5
అనంతపురం

ఆగిని డ్రిప్ ఇరిగేషన్ కంట్రోల్ రూంను పనులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

'కోడిగుడ్లలో కోట్లు కొట్టేస్తున్నారు'..!

◆ మధ్యాహ్న భోజనంకు సరఫరా చేయని కాంట్రాక్టర్

◆ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

◆ ఎమ్మెల్యేలందరూ గైర్హాజరే...!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ఇవ్వకుండా కాంట్రాక్టర్లు కోట్లు కొట్టేస్తున్నాడని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ ఓ.ఆనంద్ స్పందిస్తూ ఈ విషయంపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేసి విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ హాలులో ఛైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన శనివారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంక్షేమం, విద్య, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగాలపై చర్చ జరిగింది.

గుడ్లలో కోట్లు కొట్టేస్తున్నారు
ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందించే కోడిగుడ్లలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సమావేశంలో అధికారులను నిలదీశారు. మధ్యాహ్న భోజనంను జిల్లాలో నాలుగు లక్షల మంది విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. కోడిగుడ్లను వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే ఇస్తున్నారని, దీనిపై తాను స్వయంగా పరిశీలించానని చెప్పారు. గుడ్లు ఇవ్వకుండానే ఇచ్చినట్టు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నమోదు చేసి బిల్లులు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కోడిగుడ్డ ధర ఏడు రూపాయలకు పైగా ఉందన్నారు. ఈ లెక్కన నాలుగు లక్షలకు చూస్తే రూ.28 లక్షల వరకు ఒక్క రోజుకే కాంట్రాక్టర్‌కు మిగులుతోందన్నారు. ఇలా నెలలో నాలుగైదు రోజులు ఇవ్వకుండానే బిల్లులు చేస్తున్నారన్నారు. గుడ్లు ఇవ్వడం లేదన్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు తెలియజేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గుడ్ల పంపిణీలో జరుగుతున్న ఈ అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ ఆనంద్ స్పందించారు. గుడ్ల పంపిణీలో వస్తున్న ఆరోపణలపై విచారణకు ముగ్గురు సభ్యులతో విద్యా శాఖ కాని వారిని కమిటీగా నియమిస్తామని చెప్పారు. వారు పరిశీలించి నివేదిక ఇచ్చాక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జెడ్పీ సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ ఆనంద్

సంక్షేమంపై అధికార, ప్రతిపక్షపార్టీ మధ్య రగడ

సంక్షేమం మీరు చేయలేదంటే మీరు చేయలేదంటూ మెజార్టీ సభ్యులున్న వైసిపి జడ్పిటిసి సభ్యులు, ఎంపి బికె.పార్థసారధి మధ్య సభలో వాగ్వాదం జరిగింది. వికలాంగుల పింఛన్లు తొలగించారని జడ్పిటిసి సభ్యులు ఆరోపించారు. ఎవ్వరివీ తొలగించలేదని బికె.పార్థసారధి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మాటలు అమలు చేయలేదని వైసిపి ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శించారు. ఈ వాదనల అనంతరం కలెక్టర్ ఆనంద్ వివరణిచ్చారు. ప్రభుత్వం వైపు నుంచి ఎక్కడా విధానపరంగా తొలగింపులు జరగలేదని చెప్పారు. ఎక్కడైనా అటువంటి ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎంపి పార్థసారధి)

తాగునీటికి రూ.2600 కోట్లతో ప్రతిపాదనలు
ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ

సురక్షిత తాగునీటిని అందరికీ అందివ్వాలన్న ఉద్దేశ్యంతో జల్ జీవన్ మిషన్ కింద ఉపరితల నీటిని అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసామని ఆర్‌డబ్ల్యుఎస్ అంశంపై సమావేశంలో చర్చకొచ్చినప్పుడు అనంతపురం ఎస్ఇ వివరణిచ్చారు. నియోజకవర్గాల వారీగా ఈ రకమైన ప్రతిపాదనలను రూ.2600 కోట్లతో చేపట్టామన్నారు. 2028లోపు దశల వారీగా వీటిని పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఇవి పూర్తయితే ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు.

కందుల కొనుగోలును ఆరంభించాలి
ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

కంది పంట కొనుగోలును సాధ్యమైనంత త్వరగా ఆరంభించాలని వ్యవసాయంపై చర్చ జరిగిన సమయంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు. ఈ-క్రాప్ బుకింగ్ జరిగిన వారి పంటనే కొనుగోలు చేస్తారని, రిజిస్ట్రేషన్ పెట్టడం వల్ల రైతులకు ప్రయోజనం లేదని చెప్పారు. అదిలేకుండానే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను అడిగారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రిజిస్ట్రేషన్ అన్నది ఎప్పుడైనా చేసుకోవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసినంత మాత్రాన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలి అన్న నిబంధనేది లేదని చెప్పారు. రైతుకు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ ఉందని తెలిపారు. ఇది సేకరణకు ఒక అంచనా కోసం మాత్రమేనని పేర్కొన్నారు.

ఒక్క ఎమ్మెల్యేకు తీరిక లేదు..!

ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే తీరిక ఒక్క ఎమ్మెల్యేకి లేకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలున్నారు. ఇందులో ఒక్క ఎమ్మెల్యే కూడా శనివారం నాడు జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరవలేదు. సాధారణంగా ఈ సమావేశాన్ని అత్యంత ప్రాధాన్యతతో చూస్తారు ఎందుకంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయిలో అధికారుల పనితీరుతోపాటు, ప్రజా సమస్యలు చర్చకొచ్చే అవకాశముంటుంది. ఇందులో పాల్గొనడం ద్వారా వాటిని గ్రహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాల్సినవి కొన్ని ఉంటాయి. ఇంతటి కీలకమైన సమావేశానికి ఏ ఒక్కరు హాజరవకపోవడం గమనార్హం. ఒక్క హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారధి హాజరయ్యారు. ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాత్రమే హాజరయ్యారు.

సిఐ శ్రీకాంత్‌తో ఎమ్మెల్సీ అనుయాయుడి వాగ్వాదం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో హాలు బయట ద్వారం వద్ద ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుయాయుడు బొజ్జ మైసూరారెడ్డి కూర్చోలో కుర్చున్నాడు. ఆయన ప్రజాప్రతినిధి కానందున సమావేశం నుంచి బయటకు వెళ్లాలని బందోబస్తులో ఉన్న టుటౌన్ సిఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఇద్దరూ పరస్పరం వాదించుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న రాంగోపాల్‌రెడ్డి బయటకొచ్చారు. ఎమ్మెల్సీ రాగానే ఆయన అనుయాయుడు బొజ్జ మైసూరారెడ్డి సిఐపై మరింత దురుసుగా మాట్లాడారు. అక్కడున్న తోటి పోలీసు సిబ్బంది ఒక్కసారిగా మైసూరారెడ్డితో వాదనకు దిగారు. ఇంతలోనే రాంగోపాల్‌రెడ్డి కలుగజేసుకుని ఇద్దరికి సర్దిజెప్పి మైసూరారెడ్డిని సర్వసభ్య సమావేశం జరుగుతున్న హాలులోకి తీసుకెళ్లారు.

డ్రిప్ ఇరిగేషన్ పూర్తికి చర్యలు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-కూడేరు

మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తికి అన్ని చర్యలూ తీసుకుంటామని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. కూడేరు మండలం జయపురం గ్రామం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పేజ్-2లో భాగంగా రూపొందించిన మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా మధ్యలోనే ఆగిన కంట్రోల్ రూమ్ నంబర్-2ను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యం వల్ల మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు మూలన పడ్డాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని చర్యలూ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్-ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీలతో మంత్రి ముచ్చట్లు

కూడేరు మండలం కొర్రకోడు గ్రామం వద్ద వ్యవసాయ కూలీలతో మంత్రి పయ్యావుల కేశవ్ కాసేపు ముచ్చటించారు. శనివారం ఆయన కూడేరు మండలం కొర్రకోడు గ్రామం మీదుగా వెళుతూ మార్గమధ్యంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న మహిళా వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి హంద్రీనీవా నీరిచ్చి పొలాలను సాగులోకి తెస్తామంటూ మంత్రి తెలియజేశారు. అనంతరం జయపురం గ్రామం వద్ద టమోటా రైతులతో మంత్రి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

కూలీలతో మాట్లాడుతున్న మంత్రి

రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అమీన్‌పల్లి గ్రామంలో రైతులకు నూతనంగా మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీసర్వేలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను రైతులకు అందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు వివరించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవి, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టిడిపి డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, మండల అధ్యక్షులు రామన్నచౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులక పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

నీటి పారుదల వేగవంతం

అదనంగా మోటార్ ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్లూరు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండలానికి నీటి పారుదలను వేగవంతం చేసేందుకు అదనంగా మోటార్ ఏర్పాటు చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరుకు తాగునీటి సరఫరా చేసే పథకానికి అదనంగా శనగలగూడూరులో డిఎంఎఫ్ గ్రాంట్ రూ.4లక్షల అంచనాతో 40 హెచ్‌పి మోటార్‌ను అమర్చారు. గూడూరులో ఉన్న సంపు నుంచి పుట్లూరుకు ప్రస్తుతం ఉన్న 20 హెచ్‌పి మోటార్‌కు అదనంగా మరో మోటార్‌ను అమర్చారు. తద్వారా 8 గంటల వ్యవధిలో పుట్లూరు, నాగిరెడ్డిపల్లి, తక్కల్లపల్లి, నాయకునిపల్లి గ్రామాలకు నీటి సరఫరా అయి సమస్యను పరిష్కరించడానికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎంపీపీ దాసరి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపిపి దాసరిగా సూచించారు. శనివారం మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిపి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆసుపత్రిలో వార్డు, కాన్పుల గది, ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం గత సమావేశంలో తీర్మానించిన పనులు, జరిగిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్, వైద్యాధికారి వినోద్‌కుమార్, ఎంపిటిసి ఎర్రమ్మ, సిహెచ్ఓ మోహన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, రమేష్‌బాబు, హెల్త్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ఉద్యోగులను మోసం చేసిన ఎన్‌డిఎ ప్రభుత్వం

యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కుందుర్పి

ఎన్‌డిఎ ప్రభుత్వం ఉద్యోగులను నిలువెత్తునా మోసం చేసిందని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో యుటిఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా డిఎ బకాయిలు చెల్లించాలని, పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఓబులేసు, మండల నాయకులు సాయితేజ, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు యూటిఎఫ్ నాయకులు

ఎస్‌కెయు కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి

వినతిపత్రం అందజేస్తున్న ఎపి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో పరిధిలోని ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని ఎపి రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ కోరారు. ఈమేరకు శనివారం ఎస్‌కెయులోని ఛాంబర్‌లో విసి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమకు జీతాలు పెంచలేదన్నారు. చాలీచాలని జీతాలతో ఆర్థికంగా చాలా నష్ట పోతున్నామని వాపోయారు. పని భారం ఉన్నప్పటికీ సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కావున తమకు టైంస్కేల్‌ను వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌కెయు ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ టెక్నికల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రవిమోహన్, మారుతీకుమార్, క్రాంతికుమార్, చంద్రశేఖర్, భాస్కర్‌రావు, కరుణాకర్, గుణశేఖర్, మురళీధర్, భవాని, వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

1వ రోడ్డు శివాలయం పునర్‌నిర్మాణానికి భారీ విరాళాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని 1వరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామస్వామి ఆలయం పునర్‌నిర్మాణానికి పెద్ద ఎత్తున విరాళాలు వస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక్క రోజే వచ్చిన రూ.26 లక్షలను ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాలయం పునర్ నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి సూచించడంతో 80 శాతం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మిగిలిన 20 శాతం నిధులకు దాతలు సహకారించాల్సి ఉందన్నారు. అందులో భాగంగా ఒక్క రోజే 26 లక్షలు వసూలు కావడం ఎంతో విశేషం అన్నారు. శివాలయం ఛైర్మన్ నరేంద్రచౌదరి రూ.10 లక్షలు, లక్ష్మీరెడ్డి, శ్రీనివాస్‌చౌదరి రూ.6 లక్షలు, మాధవిలత రూ.2 లక్షలు, శివరాం ప్రసాద్ రూ.2 లక్షలు, చరంజీవి రెడ్డి, చరిత, మల్కారి రామచంద్రారావు కుమారులు రూ.10.1111 లక్షలు, బల్లా పల్లవి, ఆదిశేషయ్య రూ.10,116, చంద్రమౌళి రూ.లక్షలతో పాటు మరికొంత మంది దాతలు విరాళాలు అందజేశారు.

రాజుకున్న ఎంపిపి ఎన్నిక వివాదం

బొమ్మనహాల్‌లో వైసిపి, టిడిపి పరస్పర దాడులు - 5న ఎంపిపి ఎన్నికకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ ఎంపిపి ఎన్నిక వివాదం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. ఖాళీగా ఉన్న బొమ్మనహాల్ ఎంపిపి ఎన్నికను ఈ నెల 5వ తేదీన నిర్వహించాలంటూ ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మెజార్టీ స్థానాలు ఉన్న వైసిపి ఎలాగైనా ఎంపిపి పీఠాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇదే సమయంలో అధికార టిడిపి ఎంపిపిపై కన్నేసి వారి రాజకీయ ఎత్తుగడను ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో రెండు పార్టీలు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బొమ్మనహాల్ మండలంలో మొత్తం 16 మంది ఎంపిటిసిలు ఉన్నారు. గత ఎన్నికల్లో వైసిపి 16 స్థానాల్లోనూ విజయం సాధించి ఎంపిపి పీఠాన్ని కైవసం చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడంతో నలుగురు ఎంపిటిసిలు వైసిపిని వీడి టిడిపికి మద్దతు ప్రకటించారు. రెండు నెలల క్రితం అనారోగ్య సమస్యలతో ఎంపిపి పద్మ తన పదవికి రాజీనామా చేశారు. ఖాళీగా ఉన్న ఎంపిపి స్థానానికి ఈ నెల 5వ తేదీన ఎన్నికను నిర్వహించాలంటూ ఎన్నికల స్పెషలాఫీసర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇందులో భాగంగా ఎంపిపి ఎన్నికను నిర్వహించేందుకు మండల అధికారులు సిద్ధం అయ్యారు.

వైసిపిలో చీలిక

వైసిపి ఎంపిటిసిలు రెండుగా చీలిపోవడంతో ఎన్నిక ఉత్కంఠకు దారితీస్తోంది. టిడిపికి చెందిన నారాయణస్వామి, వైసిపికి చెందిన కోటిరెడ్డి వద్ద వారి మద్దతు ఎంపిటిసిలను ఉంచుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా సరిహద్దును ఉన్న కర్నాటక ప్రాంతంలో ప్రత్యేక శిబిరాల్లో ఎంపిటిసిలు ఉంచినట్లు సమాచారం. ఎవరి వద్ద ఎంత మంది ఎంపిటిసిలున్నారన్న దానిపై మాత్రం రెండు పార్టీలు స్పష్టత ఇవ్వడం లేదు. తామే ఎంపిపి పీఠాన్ని కైవసం చేసుకుంటామంటూ రెండు పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నా తమకు ఎంటి న్యాయం జరగలేదని, ఒక్క రూపాయి కూడా తమకు నిధులు విడుదల చేయలేదంటూ వైసిపి ఎంపిటిసిలు ముఖ్య నాయకుల వద్ద బాహాటంగానే ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో మెజార్టీ వైసిపి ఎంపిటిసిలు ఆ పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్నారని, ఇది తమకు లాభిస్తుందని టిడిపి భావిస్తోంది. 5న తేదీన జరిగే ఎంపిపి ఎన్నికలో ఖచ్చితంగా తాము ఎంపిపి పీఠాన్ని కైవసం చేసుకుంటామని అధికార పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు.

అగ్గిరాజేసిన ఎంపిపి ఎన్నిక
టిడిపి.. వైసిపి పరస్పర దాడులు

ఎంపిపి ఎన్నిక వివాదం వైసిపి, టిడిపి మధ్య అగ్గిని రాజేసింది. శనివారం నాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద టీడీపీ, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. ఇది తీవ్రం అయ్యి ఒకరిపై ఒకరు భౌతికదాడులు కూడా చేసుకున్నారు. ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో తమ పార్టీ ఎంపిటిసిలకు విప్ జారీ చేస్తూ పత్రాలను ఎంపిడిఒకు అందజేసేందుకు వైసిపి రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తన మద్దతుదారులతో కలిసి మండల అభివృద్ధి కార్యాలయానికి వెళ్లారు. ఇదే సమయంలో అక్కడున్న టిడిపి నాయకులు వైసిపి మద్దతుదారులతో వాదనకు దిగారు. టిడిపి, వైసిపి మద్దతుదారులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో దాదాపు రెండు పార్టీల నుంచి ఎనిమిది మంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. గాయపడిన వారు ప్రస్తుతం బళ్లారిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కాగా ఈ ఘటనపై ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్ఐ నబీరసూల్ తెలియజేశారు.

దౌర్జన్యం వద్దు : మెట్టు

రాయదుర్గం : బొమ్మనహాల్ ఎంపిపి ఎన్నికలో అధికార టిడిపి దౌర్జన్య రాజకీయాలు చేస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. శనివారం రాయదుర్గంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం తాము బొమ్మనహాల్ ఎంపిడిఒ కార్యాలయం వద్దకు వెళ్తే తెలుగుదేశం పార్టీకి చెందిన గిడ్డ మల్లికార్జున, తిమ్మరాజు, రవి, భాస్కర్, నారాయణస్వామి తదితరులు తమతో కావాలనే ఘర్షణకు దిగారన్నారు. రాయదుర్గం రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. తాము శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శాంతిని కోరేవారైతే ఎన్నికను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించేలా చూడాలన్నారు. న్యాయబద్ధంగా ఎన్నిక నిర్వహించాలే చూడాలని కోరుతూ తాను వైసిపి ముఖ్య నాయకులతో కలిసి ఆదివారం నాడు ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దివ్యాంగులు అంటే దివ్యమైన అవయవాలు కలిగిన వారని, దివ్య శక్తులు కలిగి ఉంటారని వారి సమస్యలు పరిష్కరించడమే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తోందని, ఎంపీ తన వంతు కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సక్షమ్ ఆధ్వర్యంలో శనివారం గీతామందిరంలో దివ్యాంగ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపి అంబికా, ఆత్మీయ అతిథిగా ఐడిఈఏ సీఈఓ న్యూఢిల్లీ మల్లికార్జున ఐతా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగులు అందరూ ఐక్యమత్యంగా ఉంటూ ఒకరినొకరు సహాయంగా ఉంటూ అద్భుతమైన ప్రగతిని సాధించవచ్చని సూచించారు. మరో ముఖ్య అతిథి రాఘవేంద్ర మాట్లాడుతూ దివ్యాంగులు అసాధ్యమైన కార్యాలను సుసాధ్యం చేసిన చరిత్రను కలిగి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సక్షమ అనంతపురం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మహిళా ప్రముఖ్ సువర్ణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసిహెచ్‌ఎస్ పాలిక్లినిక్ ప్రారంభం

పాలిక్లినిక్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ సైనికులకు మెరుగైన ఉచిత వైద్య సేవలను అందించేందుకు శనివారం ఏర్పాటు చేసిన ఎక్స్ సర్వీస్మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఇసిహెచ్‌ఎస్) పాలిక్లినిక్‌ను జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మజోర్ జనరల్ అజయ్ మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ సైనికులకు ఉచితంగా వైద్యం అందించేందుకు 700 చదరపు గజాల విస్తీర్ణంలో రెండతస్తుల భవనంలో క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్లినిక్‌ను మాజీ సైనికులు, వీరనారీమణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్, సైనిక సంక్షేమ అధికారి, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎండూరు రామసుబ్బయ్యకు నివాళి

నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం

దివంగత వైద్యులు ఎండూరు రామసుబ్బయ్యకు శనివారం నగరంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న డిఆర్ ఫంక్షన్ హాల్‌లో నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ కాలవ శ్రీనివాసులు రామసుబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. అలాగే మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో రామసుబ్బయ్య తనయుడు లెఫ్టినెంట్ జనరల్ వైవికె మోహన్, సేనా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్, సతీమణితో కలిసి రామసుబ్బయ్యకు నివాళులర్పించారు. వీరితోపాటు ఐఎంఎ ఆధ్వర్యంలో వైద్యులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సైనికుల సంఘం జనరల్ సెక్రటరీ పట్నం విశ్వేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, పి.సిద్దన్న, ఎం.నరసింహులు, ఇ.రంగారెడ్డి, బిఎ.హుస్సేన్, బాలస్వామి, బండి వెంకటరమణ, పెంచలయ్య, గొల్ల ఈశ్వరయ్య, వికె.రంగారెడ్డి, వైద్యులు రాంప్రసాద్, శ్రీనివాసులు, నాగమోహన్, హైమ, అంజన్‌కుమార్, ప్రముఖులు కుమారులు డాక్టర్ వెంకట్, కుమార్తె డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధ్యాపకులకు 'పూలే' అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని ఎస్‌ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకురాలు వాధులపల్లి ఫిరోజ, హిందీ అధ్యాపకురాలు నరాల శ్రీదేవిని సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డులు వరించాయి. ఈమేరకు శనివారం బాపట్ల జిల్లాలోని బుర్రవారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రశంసించారు,

పుట్లూరు : ఉత్తమ మహిళా ఉపాధ్యాయినిగా పుట్లూరు కస్తూరిబా గాంధీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు వై.శ్రీదేవి శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీదేవి అవార్డును అందుకున్నారు. దీంతో మండలంలోని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

రాప్తాడు : మండలంలోని ఎపి మోడల్ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకూ విద్యను బోధించేందుకు పిజిటి, ఎకనామిక్స్ ఉద్యోగానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎ ఎకనామిక్స్, బిఇడి చదివిన వారు అర్హులు అన్నారు. పూర్తి వివరాలకు సెల్.. 6303 631719 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శెట్టూరు : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కెపి చిత్తప్ప పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ములకనూరు జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 'శక్తి సురక్ష టీం' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, రోడ్డు ప్రమాదాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అక్కులప్ప, పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వరప్ప, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE , GOOTY
H.M.O.P.No: 49/2025

Between:
Boya Padma W/o Poliki Ravikumar D/o Boya Babu, R/at D.No:1/227, Main Road, Pathakothacheruvu Village, Guntakal Mandal, Ananthapuramu Dist. Now R/at D.No: 18-795-d-6-5b Thilak Nagar, 60 feet road, Guntakal Mandal, Ananthapuramu Dist. **...Petitioner**

And

Poliki Ravikumar S/o P. Venkatesu, Hamali work, R/o D.No.1/227, Pathakothacheruvu Village, Guntakal Mandal, Ananthapuramu Dist. **...Respondent**

NOTICE TO RESPONDENT

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 27-01-2026వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.M.CHOWDESWARIAH, Advocate, Ananthapuram, Cell:9440525212

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) : GOOTY
H.M.O.P.No.142/2025

Between:
AMUDALA SUJITHA **...Petitioner**

And

GALLA ANAND KUMAR **...Respondant**

NOTICE TO RESPONDANT

Galla Anand Kumar, S/o Galla Kotaiah, Private Employee, R/o Bindela Colony, Yellamma Street, Opp. Indian Petrol Bunk, Gooty Road, Ananthapuramu Town & District

పై అర్జీదారురాలు తనకు నీతో 08-02-2015వ తేదిన శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానము, పెన్నఅహోబిళము, ఉరవకొండ, అనంతపురము జిల్లా వద్ద జరిగిన వివాహమును రద్దు చేయవలయునని పై కోర్టులో అర్జీని దాఖలు చేసుకొనినది. కోర్టు వారు సదరు అర్జీకి 19-01-2026 తేదీకి వాయిదా వేసినారు. కావున నీవు 19-01-2026వ తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలయును లేనంతట నీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందు మూలంగా తెలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Hearing Date 19.01.2026
V.C.K. GOPI NATH,
Advocate for the petitioner, Gooty

BEFORE THE HON'BLE PERMANENT LOKADALAT FOR PUBLIC UTILITY SERVICES: ANANTAPURAMU, ANDHRA PRADESH
P.L.A.C No:55/2021

Between:
Canara Bank (Rep by its Authorized Officer & Manager, CANARA Bank, Main Branch II, Anantapuramu). **...Petitioner**

And

Shaik Sadak Nee @ S.Sadakni Died by L.Rs Added by 2 to 4. **...Respondents**
R2: Shaik Mahaboob Peera, Husband of deceased Respondent, Muslim, R/at D.No. 6-223-92, Uma Nagar, Anantapuramu.
R3: Ayusha, Daughter of deceased Respondent, Muslim, R/at D.No.6-223-92, Uma Nagar, Anantapuramu.
R4: Dilshad, Daughter of deceased Respondent, Muslim, R/at D.No.6-223-92, Uma Nagar, Anantapuramu

పై నెంబరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తము 23-01-2026 వ తేదీ ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.RAMESH BABU
Advocate, Ananthapuram. Cell; 9398549442

సావిత్రీబాయి పూలే పోరాటం ఆదర్శనీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారతీయ సంఘ సంస్కర్తగా, మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, రచయిత్రి అని సాయిత్రిబాయి పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శణీయమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రముఖ సైకియాట్రిస్టు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోనికృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సెమినార్, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళలకు విద్య అందకుండా చేసిన, ఎన్నో అవరాధాలను ఛేదించి పాఠశాలలను స్థాపించిన సావిత్రిబాయి పూలే పోరాటం నేటికీ ఆదర్శమన్నారు. సమానమైన విద్య, దళిత బహుజనుల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని యువత, మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించి 'మహిళల విద్య సమాజ పురోగతికి పునాది', 'సావిత్రిబాయి పూలే ఆశయాలు కొనసాగాలి' అంటూ నినాదాలు చేస్తూ చైతన్యం కల్పించారు. ఐద్వా నగర కార్యదర్శి అశ్విని మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలపై పెరుగుతున్న వివక్ష, అసమానతలు, సామాజిక అన్యాయాలపై పోరాటం మరింత బలపడాలని పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో నడుచుకుంటూ మహిళల హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు

గుంతకల్లులో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ఐద్వా ఆధ్వర్యంలో నివాళి

అనంతపురంలో మాట్లాడుతున్న సైకియాట్రిస్టు విశ్వనాథ్‌రెడ్డి

శంషాద్, అశ్విని, కృష్ణవేణి, కరస్పాండెంట్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లు : దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అనిసిఐటియు కాలనీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని సిఐటియు కాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. చిన్నతనంలోనే ఆమె ఆలోచన విధానాలు సమాజ సేవ వైపే ఉండేవన్నారు. ఆమెకు తొమ్మిదేళ్ల వయసున్నప్పుడే జ్యోతిరావు పూలేతో వివాహం కావడంతో జ్యోతిరావు పూలే సహకారంతో విద్యాభ్యాసం చేసి విద్య అందని దళితులు, బడుగు బలహీన వర్గాల మహిళలకు పాఠశాల నెలకొల్పి విద్యాభ్యాసం చేయించిందన్నారు. కేవలం నాలుగేళ్లలోనే 20 పాఠశాల నెలకొల్పి మధ్యాహ్న భోజనం, ఉచిత విద్య అందించడంలో మంచి కృషి చేసిన సంఫ ఎసంస్కర్త అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మీబాయి, జయమ్మ, సుగుణ, ప్రభావతి, సాయిప్రేమ, ఆదిలక్ష్మి, పూర్ణిమ, తులసి, పార్వతి, మారెక్క, లక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధ్యతగా వాహనాలను నడపాలి

ప్రజాశక్తి-గుత్తి

వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా వాహనాలను నడపాలని మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ మనోహర్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల బస్సు డ్రైవర్లు, రవాణా సిబ్బందికి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు. డ్రైవర్లు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం చేసిన ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టానికి దారితీస్తుందన్నారు. అత్యవసర పరిస్థితులు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలని విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె. పద్మావతమ్మ, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఛార్జి సాయినాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నమ్రత, ఎఒ ఇంతియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంవిఐ మనోహర్‌రెడ్డి

గుత్తిలో మాట్లాడుతున్న ఎంవిఐ మనోహర్‌రెడ్డి

అనంతపురం : రోడ్డు భద్రత ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులు సూచించారు. శనివారం నగర సమీపంలోని రూట్స్ పబ్లిక్ స్కూల్‌లో రోడ్డు ప్రమాదాలు, భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులతోపాటు విద్యార్థులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వసంతలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ప్రతీష్‌కుమార్, డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలం తురకపల్లిలో పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మండలంలోని తురకపల్లి గ్రామంలో రైతులకు నూతనంగా మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జి.పుణ్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి శ్రీలత, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, విఆర్ఒ ప్రవీణ్‌రెడ్డి, టిడిపి నాయకులు బి.నాగిరెడ్డి, పి.జయపాల్‌రెడ్డి, డి.హనుమంతురెడ్డి, బోయ శంకర్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని జి.కొట్టాల గ్రామంలో నూతనంగా మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సురేఖ, టిడిపి సీనియర్ నాయకులు ఓబులేసు, ఇన్‌ఛార్జి వీఆర్వో పరంజ్యోతి, పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని 85 నిట్లూరు గ్రామంలో రైతులకు నూతనంగా మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాము, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కొత్త ఆశలతో..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ వారం కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాం. గతేడాది మంచి చెడులను సమీక్షించుకో వడంతోపాటు అడ్డుగెట్టబోయే నూతన సంవత్సరం బాగుండాలని 2026 సంవత్సరానికి కోటి ఆకాంక్షలతో జనం స్వాగతం పలికారు. గతేడాది అంత మంచి కాదు.. అంత చెడు కాదన్నట్టు సాగింది. ప్రకృతి కూడా అదే రకంగా ఉంది. ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావం, తరువాత అధిక వర్షాలు పడ్డాయి. వ్యవసాయానికి అంతగా కలసి రాలేదు. పంటలకు ధరల్లేక నష్టపోయారు. కొత్త సంవత్సరం ఏ రకంగా ఉండనుందో చూడాల్సి ఉంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1వ తేదీ గురువారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఎక్కడాలేని సందడి నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మాత్రం దీక్ష చేపట్టడం చర్చనీయాంశమైంది. నూతన సంవత్సరం రోజు దీక్ష కూర్చోని ప్రజలు పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంట్లోనున్న వృథా చెత్తను బయట పడేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. అందరం కలసి తాడిపత్రి పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందామని చేసిన ప్రచారం ఆసక్తికరంగానూ మారింది. ఇక డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం వేడుకలు జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగాయి. పెద్ద ఎత్తున ఈవెంట్లు నడిచాయి. అన్నింటికంటే పెద్దగా నిర్వహించిన హర్మోన్ సిటిలో మాత్రం అపశృతి చోటు చేసుకుంది. ఈవెంట్ ఏర్పాట్లలో పనికెళ్లిన కార్మికుడు ఒకరు విద్యుత్‌ఘాతానికి గురై చనిపోవడం పెద్ద చర్చనీయాంశమైంది. ఒకవైపు కార్మికుడు చనిపోయినా ఈవెంట్ యథావిధిగా కొనసాగడంపై విమర్శలొచ్చాయి. బయట నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు హర్మోన్ యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం అందజేసింది. ఆ చిన్న ఘటన మినహా అంతటా ఉత్సహపూరిత వాతావరణంలోనే నూతనోత్సవ వేడుకలు జరిగాయి. డిసెంబర్ మాసంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.20 కోట్లకుపైగానే మద్యం వ్యాపారం చివరి రెండు రోజులు జరిగాయి. ఇదే వారంలో సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నంలో జరుగుతున్న నేపథ్యంలో సిఐటియ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. జీపు జాతాలు, స్కూటర్ ర్యాలీలు నిర్వహించింది. అదే సందర్భంలో రాష్ట్రంలోనే మహాసభ కావడంతో బహిరంగ సభలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివెళ్లారు.

ఈ వారంలో జరగబోతున్న ఎపీ ఎన్జీవో సంఘం ఎన్నికలు వేడిని రాజేస్తున్నాయి. రెండు ప్యానల్స్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా ఈ ఎన్నికలు ఉండటం గమనార్హం. రెండు వైపుల నుంచి ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కదిరి, అనంతపురంలో గంజాయి ముఠాలను పట్టుకోవడమే కాకుండా వారిని బహిరంగంగా వీధుల్లో నడిపించడం చర్చనీయాంశమైంది. గంజాయి అమ్మే బ్యాచ్‌కు పోలీసు శాఖ గట్టిగా హెచ్చరికలు చేసింది. అనంతపురం జిల్లాలోనూ పెద్దఎత్తున గంజాయి అమ్ముతున్న ఆనవాళ్లు ఉన్నాయి. పలుమార్లు పోలీసుల చేతికి చిక్కి జైళ్లకు వెళ్లినా ఇంకా అనేక మంది అమ్మకాలతోపాటు, వినియోగం చేసేవాళ్లు ఉంటున్నారు. ఇందులో అత్యధికంగా యువత ఉంటున్నారు. వాటి వాడకం నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. గంజాయిపై పోలీసులు తీసుకుంటున్న కట్టడి చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.

'కెఎస్‌ఆర్'లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కెఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో శనివారం ఈగల్ టీం ఆధ్వర్యంలో పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఈగల్ ఆర్గనైజేషన్ లక్ష్యాలు, బాధ్యతలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, ఈగల్ సోషల్ మీడియా వేదికల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మత్తుపదార్థాల దుర్వినియోగంపై కలిగే దుష్పరిణామాలు, యువత భవిష్యత్తుపై వాటి ప్రభావం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, ఈగల్ నోడల్ ఆఫీసర్ పద్మిని, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు, ఈగల్ టీమ్ సబ్-ఇన్‌స్పెక్టర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

గుత్తి : పట్టణంలోని సిపిఐ కాలనీలో శనివారం ఎస్ఐ కె.సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలో బెల్ట్ షాపులు నిర్వహణ, మట్కా, గుట్కా నిర్వహిస్తున్నారనే అనుమానితుల ఇళ్లలో తనిఖీ చేపట్టారు. అలాగే డ్రోన్ కెమెరా సహాయంతో కాలనీ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

దిగ్విజయంగా ఎఐసి-ఎస్‌కెయు ఒప్పందం

ప్రజాశక్తి -అనంతపురం

ఒప్పంద పత్రాలను అందుకుంటున్న ఎఐసి, అనంతలక్ష్మి ప్రతినిధులు

అనంతలక్ష్మి విద్యార్థుల కోసం ఎస్‌కెయులోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఎఐసి)తో అనంతలక్ష్మి కళాశాల ఏర్పరుచుకున్న ఒప్పందం రెండవ సంవత్సరం దిగ్విజయంగా కొనసాగింపునకు శనివారం అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరం భాగస్వామ్యంలో సాధించిన మంచి ఫలితాలు, విద్యార్థులు, అధ్యాపకుల్లో కనిపించిన ఆలోచనా మార్పు ఈ రెండో ఏడాదికి బలమైన పునాది అయిందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఎఎల్‌టిఎస్ క్యాంపస్‌లో స్టార్టప్ ఆలోచనల అభివృద్ధి, మెంటారింగ్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ పరిచయం మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రమేష్‌నాయుడు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, పరిశోధన విభాగం డీన్ మురళీధర్ కుర్ని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కుందుర్పి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శనివారం మండల కేంద్రమైన కుందుర్పిలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జీకే కృష్ణమూర్తి, ఎస్ఐ మహేష్, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీదేవి, తిప్పేస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షాన వార్తలు రాస్తూ మన్ననలు పొందడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎస్‌కె సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ హనుమంతురాయుడు, కురుబ సంఘం మండల మాజీ అధ్యక్షులు కెపి గోపాల్, ఐటి జిల్లా సెక్రటరీ ఆలూరు నరేష్, సీనియర్ నాయకులు పెద్ద ఓబులేసు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ హనుమేష్, కుందుర్పి పంచాయతీ కన్వీనర్ మల్లికార్జున, నాయకులు లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌ఎస్' డిజైనర్ స్టూడియో ప్రారంభం

అనంతపురం : నగరంలోని రామ్‌నగర్‌లోని తాడిపత్రి బిర్యాని సెంటర్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎల్‌ఎస్' డిజైనర్ స్టూడియోను అపెక్స్ సంస్థ డైరెక్టర్ సుకన్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌ఎస్ డిజైనర్ స్టూడియోలో మహిళలకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన చీరలు, డ్రెస్ మెటీరియల్, రెడీమేడ్ టాప్‌లు, లాంగ్ ఫ్రాక్‌లు, స్టిచ్చింగ్ మెటీరియల్‌తోపాటు మహిళలకు బ్యూటీపార్లర్ సేవల అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎస్ డిజైనర్ స్టూడియో అధినేత వర్షిత, ప్రభావతి, జ్యోతి, నిర్మల, మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌కెయు అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో 16 కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు సెక్రటరీ బి.జెసి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఎస్‌టియు రూపొందంచిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని, జిఒల పుస్తకం, జంత్రీ, స్టిక్కర్ క్యాలండర్లను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటశివుడు యాదవ్, జిల్లా సిఎంఒ కె.చంద్రశేఖర్ శనివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నీలూరు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సిఐపై టిడిపి నాయకుడి దౌర్జన్యం దారుణం

పుట్లూరు : అనంతపురంలో సిఐ శ్రీకాంత్‌యాదవ్‌పై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడు మైసూరారెడ్డి దౌర్జన్యం చేయడం బాధాకరమని వైసిపి జిల్లా కార్యదర్శి వెంకటరమణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. టిడిపి నాయకులు సామాన్యులనే కాకుండా పోలీసులపై కూడా దౌర్జన్యం చేస్తూ బెదిరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి, హోంమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సిఐపై దౌర్జన్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

గంజాయి నుంచి యువతను కాపాడుదాం : యుటిఎఫ్

కుందుర్పి : గంజాయి మత్తు నుంచి యువతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గంజాయి నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువతను గంజాయి మత్తు నుంచి కాపాడడానికి యుటిఎఫ్ కృషి ఎనలేనిదన్నారు. సామాజిక స్ఫూర్తితో సమాజ అభివృద్ధి కృషి చేస్తున్న యుటిఎఫ్‌ను ఎస్ఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, ఓబులేష్, మండల నాయకులు అనిల్, సాయి తేజ ,సీనియర్ నాయకులు వేణుగోపాల్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు శస్త్రచికిత్సలు

నార్పల : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పశువైద్య శాఖ ఎడి రత్నకుమార్ ఆధ్వర్యంలో శింగనమల వెటర్నరీ డాక్టర్ పద్మనాభం, నార్పల, పప్పూరు వైద్యులు సుప్రజా, శ్వేతా కలిసి శనివారం పశువులకు మందగోది ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా ఎడి రత్నకుమార్ మాట్లాడుతూ మందగోది సమస్యతో పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటాయన్నారు. ముఖ్యంగా నడవడానికి, నిలబడడానికి ఇబ్బంది పడుతుంటాయన్నారు.

షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకోండి : యుటిఎఫ్

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన ఇచ్చిన సోకాజ్ నోటీసులను వెనక్కు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్యలు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టెక్నికల్, సర్వేర్ సమస్యలు పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. వందరోజుల ప్రోగ్రాం సజావుగా జరుగుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇచ్చి మానసిక వేదన, తీవ్ర ఒత్తిడికి గురి చేయడం మంచిది కాదన్నారు. నోటీసుల ప్రభావం విద్యార్థుల బోధనకు ఆటంకం కలిగించే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

7న సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగమేళా

అనంతపురం కలెక్టరేట్ : రాక్సా (ఎజిఎఆర్ గ్రూప్ కంపెనీ) సహకారంతో ఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈనెల 7వతేదీన సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయి, డిగ్రీ పాస్, ఫెయిల్, ఐటిఐ, డిప్లొమా పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు వరకు ఉన్న అభ్యర్థులు అర్హులే అన్నారు. పూర్తి వివరాలకు సాహిద్ నూర్ సెల్..62815 57937, ఎన్‌కె.యాదవ్ సెల్..63006 76517 సంప్రదించాలని కోరారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా ఖజానా శాఖ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎన్జీఓ హోంలో ఖజానా, ఉప ఖజానా శాఖ అధికారులు, పెన్షనర్ సంఘం నాయకులు, పెన్షనర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డిడి మాట్లాడుతూ పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లకు తమ శాఖ ద్వారా సత్వర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెద్దన్నగౌడ్, శీలా జయరామప్పలు మాట్లాడుతూ ట్రెజరీ, సబ్ ట్రెజరీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన కొత్త వరవడిని తీసుకురావడం పెన్షనర్‌లకు శుభపరిణామం అన్నారు. మా సమస్యలు నేరుగా చెప్పుకునే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెన్షనర్‌ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్, తాడిపత్రి, శింగనమల, రాయదుర్గం, కణేకల్ ఉప ఖజానా అధికారులు, తాలూకా పెన్షనర్‌ల సంఘం నాయకులు, పెన్షనర్‌ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుత్తి : నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జక్కసానిగుంట్ల గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గుత్తి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జక్కసానిగుంట్ల గ్రామానికి చెందిన పిచ్చిగుంట్ల దుర్గ అనే మహిళకు భర్త మతి చెందగా ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఒంటరితనం, ఆర్థిక, అనారోగ్యసమస్యలు చుట్టుముట్టడంతో దుర్గ భరించలేక తీవ్ర మనస్తాపం చెందింది. జీవితం మీద విరక్తి చెందిన ఆమె శుక్రవారం రాత్రి కంది పంటలకు ఉపయోగించే థీమెట్ గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆమె పరిస్థితి విషమించి మతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విషజ్వరంతో విద్యార్థిని మృతి

పెద్దవడుగూరు : విషజ్వరంతో బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని క్రిష్టిపాడులో చోతు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని క్రిష్టిపాడుకు చెందిన లక్ష్మీకాంతమ్మ, బోయ రఘు దంపతుల కుమార్తె కీర్తన (14) యాడికి మండలం రాయలచెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో తీవ్ర జ్వరం సోకడంతో పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో బాలికలను కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కీర్తన ఇంటి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.